


# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

కర్నూలు నంద్యాల

మంగళవారం | 16 డిసెంబరు 2025 పేజీలు 8


# ఉమ్మడి జిల్లాలో కదంతొక్కిన వైసీపీ శ్రేణులు

- కూటమి పై ప్రజా వ్యతిరేకత మొదలైంది
- సొంత వారికి కట్టబెట్టేందుకే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ
- లోకేష్ రెడ్‌బుక్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయి..
- హెూరెత్తిన కోటి సంతకాలసేకరణ ర్యాలీ
- వైకాపా ర్యాలీలో మంత్రి నారాయణ, కళాశాల విద్యార్థులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కోసం వైసిపి పిలుపునిచ్చిన కోటి సంతకాల ర్యాలీ కర్నూలునగరంలో హోరెత్తింది. సోమవారం కర్నూలు ఎస్‌టిబిసి కళాశాల మైదానం నుండి రాజ్ విహార్ వరకు వైకాపా శ్రేణులు కదంతొక్కారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునే తీరుతామని ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఆరంభమైందని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను మిగతా 2లో

- కోటి సంతకాల బాక్స్‌లు తాడేపల్లికి తరలింపు
- భారీగా తరలిస్తున్న వైసీపీ శ్రేణులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాలలో కోటి సంతకాల కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ శ్రేణులు కదంతొక్కారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నంద్యాల జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల వినతిపత్రాల బాక్స్‌లు నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయం నుంచి వేలాదిగా తరలివచ్చిన వైసీపీ నేతలు, పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా బయలుదేరి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పద్మావతినగర్ గేట్ వద్దకు రావడం జరిగింది. బాక్స్‌లను తరలించే కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించగా మిగతా 2లో


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


కోటి సంతకాల బాక్స్‌ల తరలింపు వ్యాన్‌కు జెండాఊపి ప్రారంభిస్తున్న వైసీపీ నేతలు

రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం

## మరువలేనిది

- పొట్టి శ్రీరాములను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి
- రాష్ట్ర మంత్రి టీజీ.భరత్.కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

2లో


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి, కలెక్టర్

ఆంధ్రరాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు త్యాగం

## చిరస్మరణీయం

- రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్
- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

2లో


అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని వనరులు

## ఎమ్మిగనూరుకే ఉన్నాయి

- ప్రభుత్వ భూములు, తాగు సాగునీరు పుష్కలంగా ఉన్న
- ఎమ్మిగనూరునే జిల్లాగా ఏర్పాటు చేయాలి
- వైసీపీ హయాంలో ఆదోనిని జిల్లా చేయాలని బుట్టా రేణుకమ్మ ఏనాడైనా అప్పటి సీఎంను కోరిందా?
- ఆదోని సరే, కనీసం ఎమ్మిగనూరు గురించి బుట్టా రేణుకమ్మ ఎప్పుడైనా ఆలోచించిందా?
- నా స్వార్థం నాది.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎమ్మిగనూరునే జిల్లా చేయాలని డిమాండ్ చేశా
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కీలక వ్యాఖ్యలు

2లో


మాట్లాడుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.వి.జయ నాగేశ్వరరెడ్డి

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్


మంత్రి నారా లోకేష్‌తో జిల్లా స్విమ్మర్స్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో ఈ నెల 12నుంచి 17వ తేదీ వరకు ఢిల్లీలో జరుగుతున్న 69వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటున్న కర్నూలు జిల్లా స్విమ్మర్స్‌ను రాష్ట్ర మానవ వనరుల శాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఢిల్లీ పర్యాటనకు వచ్చిన లోకేష్‌ను సోమవారం న్యూ ఎంపి ప్లాట్స్‌లో మిగతా 2లో

# తుగ్గలి ఎస్సైగా పి. నరేష్

**తుగ్గలి,మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన తుగ్గలి పోలీస్ స్టేషన్ ఎస్ఐగాపి.నరేష్‌ను పోలీసు ఉన్నతాధికారులు నియమించారు. తుగ్గలి ఎస్ఐగా ఉన్న బాల నరసింహులు కర్నూల్ ఎస్బి ఎస్సైగా బదిలీ చేయడం జరిగింది. దీంతో దేవనకొండ ఎస్సైగా పనిచేస్తున్న పి. నరేష్ ను తుగ్గలి పోలీస్ స్టేషన్ కు ఎస్సైగా బదిలీ చేశారు. ప్రస్తుతం తుగ్గలి నుండి బదిలీ అయిన ఎస్సై బాల నరసింహులు తన విధి నిర్వహణలో చక్కగా విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంతో పాటు, ప్రజలకు కూడా మంచి సేవా కార్యక్రమాలు చేపట్టి మండలంలో మంచి ఎస్సైగా ప్రజల నుండి గుర్తింపు పొందారు.

## జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థులు


విద్యార్థినిని అభినందిస్తున్న విద్యావేత్త రాజశేఖర్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** జనవరిలో రాజస్థాన్‌లో జరగబోయే జాతీయ స్థాయి అండర్-14 క్రికెట్ పోటీలకు నగరంలోని ఏక్యాంపు మాంటిస్సోరి పాఠశాల విద్యార్థి పి శ్రీవేంద్రనాథ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని విద్యాసంస్థల అధినేత కెఎస్‌వి రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవేంద్రనాథ్ గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లు తెలిపారు.

## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక మేనేజర్ చిన్న రాముడు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కి 23ఫిర్యాదులు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ఆర్ఓ జునైద్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, టిడ్కో అధికారి డాక్టర్ పెంచలయ్య, సూపరింటెండెంట్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## గంట వ్యవధిలోనే బాధితురాలికి సొత్తు అందజేత

### పోలీసు సేవలను అభినందించిన ప్రజలు


బాధితురాలికి కమ్మలు అందిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసులు

**డోన్, మేజర్‌న్యూస్:** నేసే అరుణకుమారి అనే వివాహిత మహిళ తన తండ్రికి ఆరోగ్యం బాలేదని, తన తండ్రిని చూడటానికి అనంతపురం జిల్లా, ఆత్మకూరు మండలం, గ్రామం నుండి సోమవారం డోన్ కొత్తబస్టాండ్‌కు తన తాతయ్య దుర్గయ్యతో కలిసి చేరుకుంది. అయితే డోన్ కొత్తబస్టాండ్ నందు తన పుట్టినిల్లు అయిన వెల్దుర్తి మండలంలోని, పుల్లగుమ్మి గ్రామానికి వెళ్ళేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా, పల్లెవెలుగు బస్సు వచ్చింది. బాధితురాలు అరుణకుమారి, తన తాత దుర్గయ్యలు కలిసి బస్సు ఎక్కి వెల్దుర్తి మండల కేంద్రానికి చేరుకున్నారు. అయితే వెల్దుర్తిలో బస్సు దిగే సమయంలో బంగారు కమ్మలు ఉన్న ఒక బ్యాగును బస్సులోనే మరచిపోయింది. ఈ విషయం పుల్లగుమ్మి గ్రామానికి చేరుకున్నాక తెలుసుకొని డోన్ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించింది. సదరు విషయాన్ని డోన్ డిఎస్‌పి శ్రీనివాసులుకు సమాచారం ఇవ్వగా, వెంటనే కమాండ్ కంట్రోల్ ద్వారా బస్సు నెంబర్‌ను కనుగొని, బ్యాగును బాధితురాలు అరుణకుమారికి డిఎస్‌పి శ్రీనివాసులు చేతుల మీదుగా అందించారు. గంట వ్యవధిలోనే బాధితురాలి సొత్తును తిరిగి ఇవ్వడంతో ప్రజలు డోన్ పోలీసుల సేవలను అభినందించారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి..ఎంపిడిఓ


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ భువనతేజ

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని ఈనెల 21వ తేది నుండి 23వ తేది వరకు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ సుహాసినమ్మ, మెడికల్ అధికారి డాక్టర్ భువనతేజలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సుహాసినమ్మ మాట్లాడుతూ 21వ తేదిన 0-5 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండలంలో 54 బూత్ లెవెల్ కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, 22, 23వ తేదిలలో ప్రతి ఇంటింటికి వెళ్ళి పోలియో చుక్కలను వేయాలన్నారు. మండల వ్యాప్తంగా 14,126 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్ నాగలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, శ్రీదేవి, అంగన్‌వాడి టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్న డిఎల్‌పిఓ


గ్రామంలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న డిఎల్‌పిఓ తిమ్మక్క

**హొళగుంద,మేజర్‌న్యూస్:** హొళగుంద మండలం ఇంగళదహాళ్,లింగంపల్లి గ్రామాల్లో ఆదోని డివిజనల్ అధికారిణి తిమ్మక్క సోమవారం సందర్శించారు. గ్రామంలో కాలని వారిగా తిరిగి పక్కగృహాలు,శ్యానిటేషన్ విషయంపై దృష్టి సారించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించడానికి గ్రామ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు కృషి చేయాలని చెప్పారు. గ్రామ కార్యదర్శులు ,సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# వైసిపి ర్యాలీకి భారీగా తరలి వెళ్ళిన వైసిపి నేతలు



**తుగ్గలి,మేజర్‌న్యూస్ :** మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయవద్దంటూ సోమవారము కర్నూలు పట్టణంలో వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీకి మండలము నుండి వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి మనవడు, వైయస్సార్సిపి ఐటి విభాగపు అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, ఎంపీపీ సలహాదారుడు హనుమంతు, వైస్ ఎంపీపీ మల్లికార్జున్ రెడ్డి తదితరులు తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి ఐటి విభాగ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్రంతో మాట్లాడి మెడికల్ కళాశాలలో మంజూరు చేయించారన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు ముందుకు రావడం సరికాదన్నారు. ప్రైవేటీకరణ చేస్తే పేదలకు కార్పొరేట్ వైద్యం అందదు అన్నారు. అలాగే పేదలు డాక్టర్లు కాలేరని అన్నారు. అందువల్ల ప్రభుత్వం మెడికల్ కళాశాల లను ప్రైవేటీకరణ చేయకూడదని ఆయన అన్నారు.

# ఘనంగా ఆర్కే కంటి వైద్యశాల వార్షికోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు రమాకాంత్ రెడ్డి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** ఆర్కే కంటి వైద్యులు డాక్టర్ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్కే కంటి వైద్యశాల 20వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేసుకున్న రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి నాయకులు రమాకాంత్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది మజిరల్ హక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ గుణంతో ముందుకు పోవాలని, గత 20 ఏళ్లుగా దాదాపు 15 వేల ఆపరేషన్లు విజయవంతంగా చేయడం, ఆరోగ్యశ్రీ ద్వారా 800 కు పైగా ఉచిత కంటిఆపరేషన్లు చేయడం సంతోషకరమన్నారు. ఆరోగ్యశ్రీ రాకముందు కూడా ఎంతోమంది అనాధలకు, నిరుపేదలకు కంటి ఆపరేషన్లు చేసి సేవలందించడం జరిగిందన్నారు. ప్రజలకు చూపునివ్వడంలో నిరుపేదలను ఆదుకోవడంలో డాక్టర్ హేమంత్ కుమార్ ముందుంటారని ఆయన సేవలో మరువరానివని పేర్కొన్నారు. ఇలాంటి వార్షికోత్సవ కార్యక్రమాలు ఆర్కే హాస్పిటల్ మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మాధవరంజయరాజు,మోజేష్,విష్ణు స్వామి, పెద్దకడబూరు టిడిపి నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజనేయులు, ఆర్కే హాస్పిటల్ అధినేత రాజేంద్రప్రసాద్, కమలమ్మ , అనూరాధ, గీతిక ఆర్కే హాస్పిటల్ సిబ్బంది, తోపాటు ఆపరేషన్ చేయించుకున్న 83 మందిరోగులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**ఆదోని, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం వైసీపీ నాయకులు మానుకోవాలని బిజెపి తాలుక కో-కన్వీనర్ నాగరాజు గౌడ్, బిజెపి నాయకులు వెల్లాల మధుసుదన్ శర్మలు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ, 2022 మార్చి 31న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసి 242కోట్ల నిధులను విడుదల చేసిందని, 2022 నుండి 2024 వరకు బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం చేయకుండా నిర్లక్ష్యం చేసింది వైఎస్సార్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కాదా అని వారు ప్రశ్నించారు. వైఎస్సార్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక రోజుకొక ప్రకటనలు చేయడం తగదన్నారు. ఆదోనిని నాలుగు మండలాల విభజన అంశముపైన ఎమ్మెల్యే పార్థసారధితోను ఆదోని జిల్లా సాధన కమిటీ ఉద్యమ నాయకులతో కలిసి వైసీపీ జిల్లా సాధన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తరలి రావాలని బిజెపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి కౌన్సిలర్ ఏ.వి. సురేష్, బిజెపి వెస్ట్ జోన్ అధ్యక్షుడు మహాదేవ, సౌత్ జోన్ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు చెన్నబసప్ప, ప్రధాన కార్యదర్శి పగిడాల రవి కిరణ్, సుబ్రమణ్యం, పూల రఘు, కాక సింగ్, రామకృష్ణ, మణికంఠ, ప్రశాంత్, ఉరుకుంద గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసిన కాటసాని రాంభూపాల్ రెడ్డి



**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** బనగానపల్లె మండల పరిధిలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానం నందు సోమవారంనాడు నంద్యాల జిల్లా వైకాపా అధ్యక్షుడు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు ఆలయానికి చేరుకోగానే ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఉమామహేశ్వరులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అధికారులు, ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# కళాశాల అభివృద్ధిని అడ్డుకోవడం సమంజసం కాదు..


మాట్లాడుతున్న ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, విద్యార్థినీ, విద్యార్థులు


ప్రిన్సిపాల్ భారతి ధ్వంసం చేయించిన సిమెంట్ బెంచీలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని క్రీడా మైదానం, కళాశాల ఆవరణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రిన్సిపాల్ భారతి అడ్డుకోవడం సమంజసంకాదని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, విద్యార్థులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం డిగ్రీ కళాశాలలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులకు క్రీడలలో నైపుణ్యం పెంచేదుకు గత రెండు సంవత్సరాల క్రితం అధ్వాన్నంగా ఉన్న క్రీడా మైదానాన్ని తన సొంత నిధులతో పాటు పూర్వ విద్యార్థులు, స్థానికులు, పట్టణ ప్రముఖుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఇటీవల ఫుట్‌బాల్ మైదానాన్ని ఏర్పాటు చేసుకొని టోర్నమెంట్ కూడా నిర్వహించడం జరిగిందన్నారు. అయితే కళాశాలలో జరుగుతున్న అభివృద్ధికి తమ వంతు సహకారం అందించి చేయూతగా నిలవాల్సిన ప్రిన్సిపాల్ భారతి తమపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తూ దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను కూడా ధ్వంసం చేయించారని వారు ఆరోపించారు. కళాశాల విద్యార్థులు, స్థానికులు క్రీడా మైదానంలోకి రానివ్వకుండా గేటుకు తాళాలు వేయడం సమంజసం కాదన్నారు. కళాశాలను అభివృద్ధి చేయాల్సిన పనిఏమి లేదని జీతం తీసుకొని ఉద్యోగం మాత్రమే చేయమని ప్రిన్సిపాల్ భారతి చెబుతుండడం విచారకరమన్నారు. ప్రిన్సిపాల్ చర్యల పట్ల కళాశాల అభివృద్ధికి సహకరించిన స్థానికులు, దాతలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రిన్సిపాల్ వైఖరిపై ఉన్నతాధికారుల తో పాటు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డికి కూడా తాము ఫిర్యాదు చేస్తామన్నారు.

సూర్య

మంగళవారం 16 డిసెంబరు 2025

# విద్యార్థులకు నాణ్యతమైన భోజనాన్ని అందించండి - ఎమ్మెల్యే అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** విద్యార్థులకు నాణ్యతమైన భోజనాన్ని అందించాలని భోజన విషయంలో ఏదైనా నాణ్యతలేని భోజనం పెడితే ఊరుకునేది లేదని పాఠశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హెచ్చరించారు. పట్టణ శివార్లలోని డా. బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తినడానికి డైనింగ్ హాల్ చిన్నగా ఉందని 600 మంది విద్యార్థులకు తినడానికి సరిపోడం లేదని ఈ విషయమై మంత్రి నారా లోకేష్ తో మాట్లాడి డైనింగ్ హాల్ పెద్దగా కట్టిచ్చేలాగా చూసుకుంటామన్నారు. అప్పటిదాకా విద్యార్థులు ఎవరు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి అందరూ ఒకేసారి తినేలాగా చూసుకుంటామని, అలాగే పిల్లలకి తాగడానికి ఆర్వో ప్లాంట్ మంజూరు చేయడం జరిగింది అని తెలిపిన ఎమ్మెల్యే భూమా



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

అఖిలప్రియ పేర్కొన్నారు. అనంతరం ల్యాబ్ మరియు పాఠశాల తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఎలాంటి అసౌకర్యాలు ఉన్నాకూడా నాకు వెంటనే తెలియజేయండి నేను చూసుకుంటానని తెలియజేసారు. యాజమాన్యానికి కూడా ఏదైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయండని వాళ్లు స్పందించకుంటే వెంటనే నాకు ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు కింద కూర్చొని తినడం చాలా భాదాకరంగా ఉందని విద్యార్థులందరూ పైన కూర్చొని తినడానికి సంబంధించి 80 టేబుల్స్ కావాలని భూమా శోభనాగిరెడ్డి ట్రస్ట్ తరఫున మేము కూడా కొన్ని ఇస్తామని, అలాగే పి 4స్కీం కింద దత్తత తీసుకునేవారు 130 మంది దాకా ఉన్నారని వారు కూడా స్పందించి ముందుకు వచ్చి పిల్లలకు టేబుల్స్ మరియు పడుకోవడానికి బెడ్స్ సహాయం చేస్తే బాగుంటుందన్నారు. విద్యార్థులు స్కూల్లో గేమ్స్ పై చాలా మక్కువగా ఉన్నారని, చెస్ రబ్బీ గేమ్ లో సెమీఫైనల్ వరకు వెళ్లడం జరిగిందని వారందరికీ మా నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా గురుకుల విద్యాలయ యాజమాన్యం గులాబీ మొక్కను నాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నూర్జహాన్, ప్రిన్సిపాల్ ఫిర్దోస్ అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన సమస్యలపై త్వరితగతిన స్పందించి సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని టుటౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 108ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐలు శివశంకర్, రామకృష్ణ, విజయలక్ష్మిలు పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

# ఐటిడిపి సభ్యుల నియామకం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధికారిక సోషల్ మీడియా విభాగమైన ఐటిడిపి కర్నూలు నియోజకవర్గ సభ్యులను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అధికారికంగా ప్రకటించారు. కర్నూలు నియోజకవర్గ నూతన ఐటిడిపి అధ్యక్షుడిగా వేముల కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, నియోజకవర్గ కమిటీ సభ్యులుగా రాంప్రతాప్, శేఖర్ యాదవ్, మనోజ్, వీరేష్‌లను నియమించారు. నూతనంగా నియమించబడ్డ ఐటిడిపి కర్నూలు నియోజకవర్గ సభ్యులు సోమవారం మంత్రి టీజీ భరత్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి గజమాల వేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి జిల్లా అధ్యక్షులు గట్టు తిలక్, నూతన ఐటిడిపి సభ్యులు పాల్గొన్నారు.



మంత్రి టీజీ భరత్‌ను సత్కరించిన ఐటిడిపి సభ్యులు

# శ్రీసుధ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**డోన్, మేజర్‌న్యూస్:** క్రీడా భారతి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో డోన్ పట్టణానికి చెందిన శ్రీసుధ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్ యాజమాన్యం మాట్లాడుతూ క్రీడా భారతి గేమ్స్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఈనెల డిసెంబర్ 13వ తేదిన నంద్యాల జిల్లా కేంద్రంలోని శాంతికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగిన వాలీబాల్ పోటీలలో అండర్-17 విభాగంలో, అండర్-14 విభాగంలో జిల్లా స్థాయి పోటీలలో సత్తా చాటి, ద్వితీయ స్థానంలో నిలిచారని శ్రీసుధ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ వేణుగోపాల్ తెలిపారు. అనంతరం శ్రీసుధ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సుదర్శన్, డైరెక్టర్లు సుధాకర్‌గుప్తా, సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ మేరీ చార్లెస్, క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, హరి, మనోహర్, సురేష్‌లను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎలిజిబెత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.





విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయ బృందం

# ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం దాదాపు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామమనీ ఎంపిడిఓ శ్రీనివాసరావు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు ఆయ న చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఓ ప్రభాకర్, పిఆర్ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఏపిఎం కృష్ణమూర్తి, ఈఓ శివకుమార్‌గౌడ్, ఎంఈఓలు వెంకటేశ్వరనాయక్, మహేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మనోహర్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపిడిఓ, అధికారులు, సిబ్బంది

# తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**దొర్నిపాడుమేజర్,న్యూస్:** మండల కేంద్రమైన దొర్నిపాడులోని తహశీల్దార్ కార్యాలయం నందు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు ప్రజల సౌలభ్యం కొరకు ప్రతి సోమవారం మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఉద్దేశంతో తహశీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండలస్థాయి అధికారులతో



పిజిఆర్ఎస్‌లో పాల్గొన్న తహశీల్దార్ సుభద్ర, ఎంపిడిఒ సావిత్రి, అధికారులు

నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల ప్రరిష్కార వేదికలో రీ సర్వేకు సంబంధించిన రెండు అర్జీలు రావడం జరిగిందని వెంటనే అర్జీలను మండల సర్వేయర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం చూపించాల్సిందిగా కోరడమైనదని ఆమె తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుభద్ర, ఎంపిడిఒ సావిత్రి, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాల్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి కార్యక్రమాన్ని తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేకత ఆయన చలువేనన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ గురుస్వామిరెడ్డి, ఆర్‌ఐ లత, మండల అధికారులు బివి.రమణారెడ్డి, ఎల్లకృష్ణ, కృష్ణమూర్తి, పద్మావతి, ఉమ్మన్న, ప్రసాద్, సునీల్, మౌలాలి, కేకే.మద్దిలేటి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న తహశీల్దార్, అధికారులు, సిబ్బంది

# జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రిడ్జ్ పాఠశాల విద్యార్థులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** జార్ఖండ్ రాష్ట్రం రాంచిలో ఈ నెల 18 నుండి 24వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి ఎస్ఎఫ్ఐ అండర్-14ఫుట్‌బాల్ బాలికల ఆంధ్రప్రదేశ్ జట్టుకు రిడ్జ్ పాఠశాల విద్యార్థులు వైనికితరెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్నట్లు పాఠశాల సిఈఓ జి గోపినాథ్ తెలిపారు. సోమవారం క్రీడాకారిణి వై నికితరెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ రిడ్జ్ పాఠశాలకు చెందిన క్రీడాకారిణి జాతీయ స్థాయికి ఎంపిక కావడం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. జాతీయ స్థాయిలో కూడా చక్కటి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కో సిఈఓ సౌమ్య గోపినాథ్, పాఠశాల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్ కమల్, వ్యాయామ ఉపాధ్యాయులు హెచ్ఓడి నాగేంద్ర, శ్రీనివాస్, కోచ్ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

# పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

**– తహల్దార్ రత్నరాధిక**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంలో అమర జీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని తహశీల్దార్ రత్నరాధిక అన్నారు. సోమవారం అమరజీవి పొట్టిశ్రీరాములు తాత్మర్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రత్నరాధిక సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పొట్టి శ్రీరాములు ఆత్మర్పణ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగం మరువలేదని, ఆయన ఆదర్శంగా ప్రతి ఒక్కరు సమాజ, రాష్ట్ర సేవలో భాగస్వాములు కావాలని కోరారు. డిప్యూటి తహశీల్దార్ ఆంజనేయులు, సర్వేయర్ రాజశేఖర్, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహశీల్దార్ రత్నరాధిక

# మేదరులకు జీవనోపాధి కల్పించాలని మంత్రికి వినతి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని గాజులపల్లి తదితర గ్రామాల్లో నివసిస్తున్న మేదరి కులస్తులు జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి జీవనోపాధి కల్పించాలంటూ మండల జనసేన పార్టీ నాయకులు నల్లబోతుల మల్లిఖార్జున రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం మంగళగిరిలోని తన కార్యాలయంలో కలసి మేదరుల సమస్యలను వివరించారు. కులవృత్తి అయిన వెదురుతో చేసే విసనకర్రలు, చాటలు, చంద్రికలు అల్లుకొని జీవనం సాగించేవారని, అటవీశాఖ అధికారులు అడవిలోకి అనుమతించకపోవడంతో వెదురు లేక కులవృత్తులను కోల్పోతున్నారని, వారి జీవనం అస్తవ్యస్తంగా మారిందని, వారికి జీవనోపాధి కల్పించాలని కోరారు. నంద్యాల డివిజన్ అటవీ శాఖ అధికారులు వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడి పిల్లలను చదివించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించి వారికి జీవనోపాధి కల్పించాలని కోరారు. వీరి వెంట మండల జనసేన నాయకులు మారెడ్డి రామయ్య తదితరులు పాల్గొని వినతి పత్రం అందించగా సానుకూలంగా స్పందించిన మంత్రి వారి సమస్యలకు పరిష్కారం చూపుతామని వారు తెలిపారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# AP/TG TET, DSC స్పెషల్ బయాలజి




**1. క్రింది వాటిని జతపరచండి**

ఎ. ఆర్కిడ్ పత్రం 1) లూయీ పాశ్చర్
బి. ఓక్ బెరడు 2) ఫెలిస్ ఫొంటానా
సి. జంతు బాహ్యచర్మ ఉపకళాకణజాలం 3) ల్యూవెన్ హుక్
డి. కుంటలోని నీరు 4) రాబర్ట్ హుక్
5) రాబర్ట్ బ్రౌన్

1. ఎ-4, బి-5, సి-2, డి-3
2. ఎ-5, బి-4, సి-3, డి-1
3. ఎ-4, బి-5, సి-3, డి-2
4. ఎ-5, బి-4, సి-2, డి-3

**2. వ్యక్తిగత పరిశుభ్రత, రక్షిత మంచినీరు, మరిగించిన నీరు త్రాగటంను క్రింది ఏ వ్యాధి నివారణ పద్ధతులుగా ఉపయోగిస్తారు?**

1. స్వైన్ ఫ్లూ 2. క్షయ
3. టైఫాయిడ్, కలరా
4. గవదబిళ్ళలు, మశూచి

**3. వ్యాధి నిర్ధారణ కారణాలు, రోగ లక్షణాలు గురించి తెలిపే శాస్త్రం?**

1. ఆంత్రోపాలజీ 2. ఎంటమాలజీ
3. పెలియాంటాలజీ 4. పెథాలజీ

**4. ప్రతిరక్షకాలు లోపించిన రక్తవర్గం ఏది?**

1. 'బి' రక్తవర్గం 2. 'ఎ' రక్తవర్గం
3. 'ఎబి' రక్తవర్గం 4. 'ఓ' రక్తవర్గం

**5. మూత్రపిండాకార రక్షక కణాలను కల్గిన నిర్మాణం క్రింది కణజాలంలో కలదు?**

1. నాళికా కణజాలం
2. సంధాయక కణజాలం 3. త్వచ కణజాలం
4. నిలువ కణజాలం

**6. హాయ్! రైబోజోమ్‌ల్లో ఉత్పత్తి అయిన ప్రొటీన్లు మరియు ఇతర పదార్థాలు, నాలో కొంత మార్పుకు గురి అయిన తర్వాత ఇతర భాగాలకు సరఫరా చేయబడతాయి. ఇక్కడ నేను ఎవరు?**

1. అంతర్జీవ ద్రవ్యజాలం 2. రిక్తిక
3. కణద్రవ్యం 4. గాల్జీ సంక్లిష్టం

**7. ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాస ప్రక్రియలు ఈ సూత్రం ఆధారంగా జరుగుతాయి?**

1. బాహ్యద్రవాభిసరణ
2. అంతర ద్రవాభిసరణ 3. వ్యాపనం
4. వ్యతిరేక ద్రవాభిసరణ

**8. క్రింది వాటిలో ఖరీఫ్ పంట కానిది?**

1. వేరుశెనగ-పత్తి 2. జీలకర్ర-పప్పుధాన్యాలు
3. చెరుకు-మిరప 4. పసుపు-సోయాబీన్

**9. క్రింది వాటిలో సరికాని జంట?**

ఎ. వరిలో కలుపు మొక్కలు - జీలుగ, తుంగ, గునుగు
బి. కూరగాయలు తోట - వంజ, ధారక, గరక
సి. మిరప, పత్తి - గోలుగుండ, బుదుతుంగ

1. ఎ,బి మరియు సి 2. ఎ మరియు బి
3. ఎ మరియు సి 4. బి మరియు సి

**10. క్రింది వాటిలో కేంద్రకయుత, కేంద్రక రహిత కణాలు వరుసగా............**

1. ఎర్రరక్త కణం, రక్తఫలకికలు
2. లింఫోసైట్స్, ఆర్‌బిసి
3. రక్తఫలకికలు, మెనోసైట్స్
4. బేసోఫిల్స్, న్యూట్రోఫిల్స్

**11. 2011 ఆర్థిక గణాంకాల ప్రకారం అత్యధికంగా పాలను ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం?**

1. ఆంధ్రప్రదేశ్ 2. ఉత్తరప్రదేశ్
3. మధ్యప్రదేశ్ 4. హర్యానా

**12. వరికి 'ఒరైజా' అని నామకరణం చేసిన వారు?**

1. నెహిమియాగూ 2. ష్లీడన్
3. లిన్నేయస్ 4. కెవిలియర్ స్మిత్

**13. క్రింది వాటిని జతపరచండి :**

ఎ. అనోకా 1. ఉప్పునీటి చేప




బి. మోసు 2. విదేశీ బాయిలర్ కోడి
సి. అసిల్ 3. మంచినీటి చేప
డి. మ్యాకరిల్స్ 4. దేశీయ బాయిలర్ కోడి
5. దేశీయ లేయర్ కోడి
6. విదేశీ లేయర్ కోడి

1. ఎ-2, బి-3, సి-5, డి-1
2. ఎ-2, బి-3, సి-4, డి-2
3. ఎ-2, బి-1, సి-4, డి-3
4. ఎ-2, బి-3, సి-4, డి-1

**14. వైరస్ వల్ల కలుగుతూ ఆడ క్యూలెక్స్ దోమ ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి?**

1. చికెన్ గున్యా 2. జపనీస్ ఎన్ సెఫలైటిస్
3. డెంగ్యూ 4. ఇన్‌ఫ్లూ ఎంజాంబి

**15. పొటాటో ఆస్మిస్ ప్రయోగంలో చక్కెర ద్రావణంను పెట్రిడిష్‌లో, నీటిని బంగాళదుంప పిట్ (గుంత)లో తీసుకున్నపుడు జరిగే ప్రక్రియ.........**

1. బాహ్య ద్రవాభిసరణ
2. అంతర ద్రవాభిసరణ
3. వ్యతిరేఖ ద్రవాభిసరణ
4. వ్యాపనం

**16. మొట్టమొదటి సంయుక్త సూక్ష్మదర్శిని తయారుచేసిన శాస్త్రవేత్త ......**

1. రాబర్ట్ హుక్ 2. లీవెన్ హుక్
3. లిన్నేయస్
4. జకారియస్ జాన్సన్

**17. సజీవ కణము బయట నిర్జీవులుగా, సజీవ కణము లోపల సజీవులుగా ప్రవర్తించే నిర్మాణాలు?**

1. బాక్టీరియా 2. హెల్మింథిస్ జీవులు
3. వైరస్ 4. శిలీంద్రాలు

**18. క్రింది వాటిలో సరికాని జత, జతులు**

ఎ. దీర్ఘకాల పంట - జొన్న, కందులు
బి. అల్పకాలపంట - పెసలు, మినుములు
సి. ఖరీఫ్ - బార్లీ, ధనియాలు
డి. తటస్థ కాల పంట - పత్తి

**19. క్రింది వాటిలో నత్రజనిని నిర్మాణ సంఘటనం (స్ట్రక్చరల్ కాంపోనెంట్) గా కలిగిలేని పదార్థం?**

1. ప్రొటీన్లు 2. కార్బోహైడ్రేట్‌లు
3. కేంద్రకామ్లాలు 4. పత్రహరితం

**20. క్రిమి సిద్ధాంతంను ప్రతిపాదించిన వారు?**

1. ష్లీడన్-ష్వాన్
2. యల్లా ప్రగడ సుబ్బారావు
3. లూయీ పాశ్చర్
4. లీవెన్ హుక్

**21. అల్పగాఢత గల ద్రావణంలో వృక్షకణంగాను, జంతుకణంను ఉంచగా?**

1. రెండూ మార్పు చెందవు
2. రెండు కృశించిపోతాయి.
3. వృక్షకణం పగలదు, జంతుకణం ఉబ్బి పగులును.
4. వృక్షకణం పగులుతుంది, జంతుకణం పగలదు.

**22. డయాలసిస్ యంత్రం ఈ సూత్రం ఆధారంగా పనిచేయును.**

1. బాహ్య ద్రవాభిసరణ
2. అంతర ద్రవాభిసరణ 3. వ్యాపనం
4. వ్యతిరేక ద్రవాభిసరణ

**23. క్రింది వానిలో సరికాని అంశం.....**

ఎ. కణద్రవ్యం సజాతీయ ద్రవపదార్థం
బి. కణంయొక్క పరిమాణంపైన విధులు ఆధారపడి ఉంటాయి.
సి. జీవియొక్క పరిమాణం ఆ జీవిలోని కణాల సంఖ్య మీద ఆధారపడి ఉంటుంది.
డి. ఏకకణ జీవులు మరణం లేని జీవులు

1. ఎ మాత్రమే 2. ఎ మరియు బి
3. బి మరియు డి 4. ఎ,సి మరియు డి

**24. క్రింది వాటిలో సరికాని జత, జాతులు**

ఎ. ప్రోటోజోవన్‌లు - మలేరియా, కాలా అజార్
బి. శిలీంద్రం - ఆంథ్రాక్స్, ఎలిఫెంటాలసిస్
సి. బాక్టీరియా - కలరా, మలేరియా, టైఫాయిడ్
డి. వైరస్ - జలుబు, డెంగ్యూ, పోలియో

1. ఎ మరియు బి 2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి 4. ఎ,బి,సి, డి

**25. నిశ్చితం (అసర్షన్(ఎ)) : శీతాకాలంలో యువకులు కంటే వృద్ధులు అధికంగా వణుకుతారు.**
**కారణం (రీజన్(ఆర్)) : చర్మం క్రింద అరియోలార్ కణజాలం క్రొవ్వును నిలువ చేసుకుంటుంది.**

1. ఎ మరియు ఆర్‌లు సరైనవి. ఆర్, ఎ కు సరి అయిన వివరణ
2. ఎ మరియు ఆర్‌లు సరైనవి. ఆర్, ఎ కు సరి అయిన వివరణ కాదు.
3. ఎ సరైనది ఆర్ సరైనది కాదు.
4. ఎ సరైనది కాదు ఆర్ సరి అయినది.

**జవాబులు :**

1)4, 2)3, 3)4, 4)3, 5)3, 6)4, 7)3, 8)2, 9)1, 10)2, 11)2, 12)3, 13)1, 14)2, 15)1, 16)4, 17)3, 18)3, 19)2, 20)3, 21)3, 22)3, 23)1, 24)2, 25)3



D. Sai Sree Reddy
Content Writer

# ఎకానమి APPSC, TGPSC గ్రూప్-1, 2 JL, DL

(గత వారం తరువాయి...)

**6. ప్రకటిత వ్యయాలు (ఎక్స్‌ప్లిసిట్ కాస్ట్స్) :**

ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తిదారుడు/ సంస్థ కొనుగోలు చేసిన లేదా అద్దెకు వినియోగించిన ఉత్పత్తి సాధనాలకు చెల్లించే ద్రవ్య వ్యయాలను / ప్రతిఫలాలను 'ప్రకటిత వ్యయాలు' అంటారు.

**7. అప్రకటిత వ్యయాలు (ఇంప్లిసిట్ కాస్ట్స్) :**

ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తిదారుని సొంత వనరులను (భూమి, జీవనం, మూలధనం) లేదా సేవలను (శ్రమ) ఉపయోగించినపుడు వాటికి కూడా మార్కెట్ ధర ప్రకారం ప్రతిఫలాలను చెల్లించి ఉత్పత్తి వ్యయాల క్రింద పరిగణించాలి. ఈ వ్యయాలను 'అప్రకటిత వ్యయాలు' అంటారు.

**8. ధర విచక్షణ :**

(ప్రైస్ డిస్క్రిమినేషన్) ఒకే యాజమాన్యం కింద ఉత్పత్తి అయినటువంటి ఒకే వస్తువును వివిధ వినియోగదారులకు వివిధ ధరలకు విక్రయించడాన్ని ధర విచక్షణ అంటారు. ఏకస్వామ్యదారుడు ఈ ధర విచక్షణ పాటిస్తాడు. ఈ ధర విచక్షణ వ్యక్తుల మధ్య గాని, ప్రాంతాల మధ్య గాని ఉపయోగాన్ని బట్టి గాని చేయవచ్చు.

**ప్రాక్టీస్ బిట్స్**

**1. సమతౌల్యత భావనను మొదట ఎపుడు ఉపయోగించారు?**

ఎ. 1600 బి. 1608 సి. 1610 డి. 1615

**2. సంస్థ సమతౌల్యం అంటే ఏమిటి?**

ఎ. ఒక సంస్థ గరిష్ట లాభాలు ఆర్జించే స్థితి బి. ఒక సంస్థ సామాన్య లాభాలు ఆర్జించే స్థితి
సి. ఒక సంస్థ నష్టాలు పొందే స్థితి
డి. ఒక పరిశ్రమ గరిష్టలాభాలు ఆర్జించే స్థితి.

**3. ఆర్థిక ఏజెంట్లు అంటే ఎవరు?**

ఎ. వినియోగదారులు బి. ఉత్పత్తిదారులు
సి. ప్రభుత్వం డి. పైవారందరూ

**4. సంక్షేమం ప్రధానంగా దేనిపై ఆధారపడుతుంది?**

ఎ. ప్రజల కోరికలపై బి. ప్రజల ఆదాయంపై
సి. సంపద ప్రజా పంపిణీపై డి. ఏదీకాదు

**5. వినియోగదారుని మిగులు భావనను మొదట ఎప్పుడు ఎవరు ప్రతిపాదించారు?**

ఎ. 1844-డ్యూపిట్ బి. 1850-ఎ.పి. పీగు
సి. 1861-మార్షల్ డి. 1814-హిక్స్

**6. తటస్థ సమతౌల్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినది ఎవరు?**

ఎ. మార్షల్ బి. వాల్రస్
సి. నాన్ హెయక్ డి. హిక్స్

**7. మార్షల్ సమతౌల్యాన్ని ఎన్ని రకాలుగా వర్గీకరించారు?**

ఎ. 2 బి. 3 సి. 4 డి. 5

**8. ఆర్థిక వ్యవస్థలో సమతౌల్యం అనేది ఒక ఆర్థిక చలాంకానికి సంబంధించినదైతే దానిని ఏమంటారు?**

ఎ. స్థిర సమతౌల్యం బి. అస్థిర సమతౌల్యం
సి. సమగ్ర సమతౌల్యం డి. పాక్షిక సమతౌల్యం.

**9. ఒక వస్తుసేవకు చెల్లించడానికి ఇష్టపడే ధరకు, వాస్తవంగా చెల్లించిన ధరకు గల తేడాను ఏమంటారు?**

ఎ. వినియోగదారుని వ్యయం
బి. వినియోగదారుని ఆదాయం
సి.వినియోగదారుని మిగులు
డి.వినియోగదారునినష్టం.

**జవాబులు :** 1)బి, 2)ఎ, 3)డి, 4)సి, 5)ఎ, 6)సి, 7)ఎ, 8)డి, 9)సి



ఎం.అన్నారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ
హనుమకొండ.

APPSC,TGPSC, DSC, SSC, RRB, POLICE and Other Competitive Exams

# కరెంట్ అఫైర్స్

❍ వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025లో మహిళల 200 మీ. & 400 మీ. ఈవెంట్‌లో దీప్తి జివాంజి (తెలంగాణ) రెండు స్వర్ణ పతకాలు సాధించింది. అయితే ఇవి ఎక్కడ జరుగుతున్నాయి?

- ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్

❍ భారతదేశంలో మొట్టమొదటి సెమీ కండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియంను టెక్నాలజీ చీఫ్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ (టి-చిప్) ఎక్కడ ప్రారంభించింది?

- హైదరాబాద్

❍ ఉద్యోగులకు నెలసరి సెలవు తప్పనిసరి చేసిన తొలి రాష్ట్రం ఏది?

- కర్ణాటక

❍ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువశాస్త్ర, సాంకేతిక నిపుణులను ఆకర్షించేందుకు 2025 అక్టోబరు 01 నుండి కొత్త వీసా కేటగిరి 'కె వీసా' ను ప్రవేశపెట్టిన దేశం ఏది?

- చైనా

❍ భారతదేశపు మొట్టమొదటి ధరించగలిగే పేమెంట్ సిస్టమ్‌ను ప్రారంభించడానికి మ్యూజ్ వేరబుల్స్ సంస్థ నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అయితే దీన్ని రూపొందించినది ఎవరు?

- ఐఐటి, మద్రాసు

❍ "ఆమె సూర్యుడిని కబళించినది" - పుస్తకాన్ని ఇటీవల ఏ.పి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. కాగా ఆ పుస్తక రచయిత ఎవరు?

- లక్ష్మీ ముగ్గర్వర్ పురి

❍ ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయుసిఎన్)లో ఇటీవల సభ్యత్వం పొందిన దేశం ?

- అర్మేనియా

❍ రక్షణ రంగంలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించడంతో పాటు సంచార పంపిణీ సహకారానికి సంబంధించి భారత్ ఏ దేశం మధ్య ఇటీవల 3 కీలక ఒప్పందాలు కుదిరాయి?

- ఆస్ట్రేలియా

❍ నకిలీ మద్యం అమ్మకాలను అరికట్టడానికి ఎక్సైజ్ సురక్ష యాప్‌ని ప్రారంభించిన రాష్ట్రం ఏది?

- ఏ.పి.

❍ ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ నుండి అధికారికంగా గుర్తింపు పొందిన దేశంలోని తొలి డ్యుగాంగ్ కన్జర్వేషన్ రిజర్వు ఏ రాష్ట్రంలో ఉంది? - తమిళనాడు

❍ వన్డేల కోసం టీమ్ ఇండియాకు బిసిసిఐ కొత్త కెప్టెన్‌ను నియమించింది. రోహిత్ స్థానంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సారధి ఎవరు?

- శుభమన్ గిల్

❍ దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో భారత్ 22 పతకాలు సాధించి 10వ స్థానంలో నిలిచింది. అయితే తొలి స్థానంలో ఉన్న దేశం ఏది?

- బ్రెజిల్. (మొత్తం 44, స్వ.15, ర.20, కా.9)

❍ ఇటీవల ఎమ్3ఎమ్ హురున్ ఇండియా సంపన్నుల జాబితాను విడుదల చేసింది. దాని ప్రకారం రూ. 2.84 లక్షల కోట్ల సంపదతో భారతదేశపు అత్యంత సంపన్న మహిళగా నిలిచింది ఎవరు?

- రోషిణి నాడర్ మల్హోత్రా.

❍ వేలిముద్రల మోసాలు అరికట్టడానికి పామ్ సెక్యూర్ డివైస్ అనే వినూత్న బయోమెట్రిక్ సాధనాన్ని అభివృద్ధి చేసిన ఐఐటి ఏది?

- కాన్పూర్

❍ ఇటీవల మలేషియాలో జరిగిన వరల్డ్ సోషల్ సెక్యూరిటీ ఫోరమ్‌లో భారత్‌కి అరుదైన గౌరవం దక్కింది. సోషల్ సెక్యూరిటీలో రాణించినందుకు గాను మనదేశం అందుకున్న అవార్డు ఏది?

- ఇంటర్నేషనల్ సోషల్ సెక్యూరిటీ అసోసియేషన్

❍ ఇటీవల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ సంబంధించి రెండు కీలక బదిలీలు జరిగాయి. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్‌గా, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ డైరెక్టరుగా నియామకం అయిన వారి పేర్లేంటి?

- ప్రవీణ్ రంజన్, ప్రవీణ్ కుమార్.

❍ ఇంపాటియెన్స్ రాజిబియానా అనే కొత్త బాల్సమ్ పుష్ప జాతిని ఏ రాష్ట్రంలో కనుగొన్నారు?

- అరుణాచల్‌ప్రదేశ్

❍ 2025 హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో భారతదేశం ర్యాంక్ ఎంత?

- 85 (2024తో పోలిస్తే 5 స్థానాలు తగ్గింది)

❍ ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం భారతదేశంలోని ఏ రాష్ట్రంలో యుపిఐ లావాదేవీల తలసరి వినియోగ తీవ్రత ఎక్కువగా ఉంది?

- తెలంగాణ

❍ 2025-26 సం.నకు యుఎన్ గ్లోబల్ జియోస్పేషియల్ ప్రాంతీయ కమిటీకి సహ ఛైర్ పర్సన్‌గా ఏ దేశం ఎన్నికైంది?

- భారత్

❍ అధిక దిగుబడినిచ్చే ఎక్కువ కాలం పండించే పత్తి సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం అక్టోబరు 2025లో ప్రారంభించిన మిషన్ ఏది?

- కపాస్ క్రాంతి మిషన్

❍ దాడులు, వేధింపులకు గురయ్యే హిజ్రాలకు పూర్తిస్థాయి రక్షణ కల్పించడానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం అరణ్ (రక్షణ) పేరుతో వసతి గృహంను ప్రారంభించింది?

- తమిళనాడు

❍ భారతదేశం యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కి 2026-2028 కాలానికి సభ్యదేశంగా ఎన్నికైంది. కాగా ఈ యుఎన్‌హెచ్ఆర్‌సి ఏ సం.లో స్థాపించబడినది?

- 2000

❍ భారతదేశం యొక్క ఎలక్ట్రిక్ వాహనాలు మరియు బ్యాటరీ సబ్సిడీలకు ఏ దేశం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) లో ఫిర్యాదు చేసింది?

- చైనా

❍ ఫిలిప్పైన్స్‌లోని మనీలాలో నిర్వహించిన మిసెస్ యూనివర్స్ విజేతగా భారత్‌కి చెందిన అమ్మాయి గెల్చింది. ఆమె ఎవరు?

- షెర్రీ సింగ్

❍ జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో చీనాబ్ నదిపై సవాల్ కోట్ ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు పర్యావరణ కమిటీ అనుమతి ఇచ్చింది. అయితే దీని సామర్థ్యం ఎంత?

- 1856 ఎమ్.డబ్ల్యు.

❍ వ్యవసాయ రంగంలో కృత్రిమ మేథ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ తెలంగాణ విశ్వవిద్యాలయం ఏ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకుంది?

- ఆస్ట్రేలియాలోని వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీతో

❍ ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు? అలాగే 2025 వరల్డ్ ఫుడ్ డే థీమ్ తెల్పండి?

- అక్టోబరు 16 (థీమ్ - హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఫర్ బెటర్ ఫుడ్ & ఎ బెటర్ ఫ్యూచర్)

❍ ఫ్యూచర్ రెడీ రైల్వేస్ అనే థీమ్‌తో ఆసియాలోనే అతిపెద్ద ఇంటర్నేషనల్ రైల్వే ఎగ్జిబిషన్ 2025 ఎక్కడ జరిగింది?

- న్యూఢిల్లీలో

❍ ఇటీవల గనుల మంత్రిత్వశాఖ ఇటీవల సున్నపు రాయిని ప్రధానఖనిజంగా వర్గీకరించింది. అయితే సున్నపురాయి యొక్క రసాయన ఫార్ములా ఏమిటి?

- కాల్షియం కార్బోనేట్

❍ 50 పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి ఆఫ్ గ్లోబల్ స్టాండర్డ్స్ అనే జాతీయ చొరవ కింద నామినేట్ చేయబడిన డ్జుకో లోయ ఎక్కడ ఉంది?

- నాగాలాండ్

❍ మలేషియాలో జరిగిన సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్ 2025లో ఆస్ట్రేలియా విజేతగా నిలవగా, భారతదేశం రజిత పతకం గెల్చుకుంది. అయితే ఈ కప్ ఏ క్రీడకు సంబంధించినది?

- హాకీ

❍ ఇరుదేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడానికి బుద్ధుడి పవిత్ర అవశేషాలను ఏ దేశంలో ప్రదర్శనకు ఉంచినట్లు కేంద్ర సాంస్కృతిక శాఖ ఇటీవల తెల్పింది?

- రష్యా

❍ వ్యవసాయ బోర్లన్నింటికి సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుంది. దీన్ని ఎక్కడ తొలుత చేపట్టనున్నారు?

- నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూర్ మండలంలో 7500 బోర్లకు సౌరఫలకాలు. వ్యయం రూ. 258 కోట్లు. యస్.పి.డిసిఎల్ భరిస్తుంది.

❍ రెడీ, రెలెవెంట్ & రెసర్జెంట్ 11 : షేపింగ్ ఎ ఫ్యూచర్ రెడీ ఫోర్స్ పుస్తకాన్ని 2025 అక్టోబరు 14న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విడుదల చేసారు. అయితే రచయిత ఎవరు?

- అనిల్ చౌహాన్




❍ బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ ఆరోగ్య సదస్సు 2025లో ప్రసంగించిన తొలి భారతీయ నటి ఎవరు?

- కృతిసనన్ (యుఎన్ఓ పాపులేషన్ ఫండ్ ఇండియాకి లింగ సమానత్వ రాయబారి)

ఈ సమావేశం థీమ్ విచ్ఛిన్నమవుతున్న ప్రపంచంలో ఆరోగ్యానికి బాధ్యత వహించడం.

❍ సస్టైనబుల్ ట్రేడ్ ఇండెక్స్ 2025లో ఇండియా ర్యాంక్ ఎంత?

- 23 (తొలి 3 స్థానాలు యుకె, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా)

❍ రాష్ట్రం నుండి బయటకు వెళ్ళే వ్యక్తుల రవాణా కోసం శ్రద్ధాంజలి పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం ఏది?

- అస్సాం

❍ వన్యప్రాణుల చట్టం 1972ను సవరించిన మొదటి రాష్ట్రం ఏది?

- కేరళ (వన్యప్రాణుల సంరక్షణ కోసం ఇటీవల కోటి రూపాయలతో ప్రత్యేక బడ్జెట్ విడుదల చేసింది)

❍ ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలిలో సభ్యదేశంగా (2026, జనవరి 01 నుండి 2028 వరకు 3 ఏళ్ళు)కు భారత ఎన్నోసారి ఎన్నికైంది.

- 7వ సారి (మొత్తం సభ్యదేశాలు 47, అధ్యక్షుడు ఓమర్ జ్విబర్ (మొరాకో)

❍ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో తొలి మహిళ ఫ్లైట్ ఇంజనీర్‌గా ఎవరు నియమితులయ్యారు?

- భావనా చౌదరి

❍ ఇటీవల అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ తొలి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అక్టోబరు 06న బాధ్యతలు స్వీకరించినది ఎవరు?

- డాన్ కట్జ్ (ఇంతకుముందు ఈ పదవిలో భారత సంతతికి చెందిన గీతా గోపినాథ్ ఉన్నారు)

❍ అంతర్జాతీయ స్థాయిలో జరిగే అన్ని ఫార్మాట్లలో కనీసంగా 50 మ్యాచ్‌లు ఆడిన భారత తొలి ఫాస్ట్ బౌలర్‌గా రికార్డ్ సాధించింది ఎవరు?

- జస్‌ప్రీత్ బుమ్రా

❍ సీసియం 137 రేడియోధార్మిక కాలుష్యాన్ని తగ్గించటానికి భారత దేశం ఏ దేశానికి ప్రష్యన్ బ్లూ క్యాప్సుల్స్‌ను బహుమతిగా ఇచ్చింది?

- ఇండోనేషియా

❍ భారతదేశంలో మొట్టమొదట గ్రీన్ ఫీల్డ్ ప్రైవేట్ యూనివర్సిటీ హార్ట్‌ఫుల్‌నెస్ అకాడమీ ఆఫ్ రీసర్చ్ & ఇన్నోవేషన్ (హెచ్ఎఆర్ఐ) ఎక్కడ ప్రారంభమయినది?

- తెలంగాణ, హైదరాబాద్.

❍ ఇటీవల శాస్త్ర రామానుజన్ ప్రైజ్ 2025 ఎవరికి ప్రధానం చేసారు?

- అలెగ్జాండర్ స్మిత్

❍ పంటలను ఆశించే చీడపురుగుల సమస్యకు పరిష్కారం దిశగా సోలార్ లైట్ ట్రాపర్ పద్ధతిని తెలంగాణలోని ఆచార్య జయశంకర్ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు ఆలోచించారు. అయితే దీన్ని ఎక్కడ ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు?

- రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మామిడిపల్లిలో కొనారావుపేట మండలం



ప్రవీణ్ కుమార్,
కంటెంట్ రైటర్

# ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు


క్రీడలను ప్రారంభిస్తున్న టిడిపి పట్టణ అధ్యక్షులు సింగిల్ విండో ఛైర్మెన్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** విధి నిర్వహణలో మానికసి ఒత్తిళ్లకు గురయ్యే ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ క్రీడా పోటీల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని టిడిపి పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్, సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్‌లు అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో డివిజన్‌కోఆర్డినేటర్ దేవానంద్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించగా ముఖ్య అతిథులుగా పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్, సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్, మండల విద్యాధికారి మేరి మార్గరేట్, ఎఎంసిచైర్మన్ శివకుమార్‌లు హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం తరగతి గదుల్లో విద్యార్థులకు విద్యాబోధన చేస్తు బిజి బిజిగా ఉండే ఉపాధ్యాయులకు కాస్తా రిలీఫ్‌ను అందిస్తు వారిలో మానిక ఉల్లాసాన్ని నింపేందుకు క్రీడాపోటీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ పి.ప్రభాకర్, శంకరయ్య, చంద్ర, ఆత్మకూరు మండల కోఆర్డినేటర్ మురళీనాయక్, సమ్మద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండల వ్యాప్తంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన మండల అధికారులు ఎంపీడీఓ తాహీర్‌హుసేన్, ఎంఈఓ అనురాధ,ఏఓ రంగనేతాజీ,విఈఆర్‌ఓలు,కార్యాలయ సిబ్బంది పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే స్థానిక గాంధి సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు,యువజన సంఘం,స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున మండల అధికారులు

# పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న మేనేజర్, అధికారులు

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని నగరపాలక మేనేజర్ యన్ చిన్న రాముడు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం నగరపాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి చేసిన ప్రాణత్యాగం వెలకట్ట లేనిదన్నారు. పొట్టి శ్రీరాములు లేకపోతే తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యేది కాదన్నారు. అమరజీవి భావితరాలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు రామకృష్ణ, సుబ్బన్న, డిఎస్‌ఓ కృష్ణమోహన్, సిబ్బంది కుర్మయ్య, కుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

**మహానీయుల త్యాగాలే మనకు ఆదర్శం :** మహానీయుల త్యాగాలే మనకు ఆదర్శమని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు జిలాని బాష అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ 75వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతుకన్న, నాయకులు షేక్ ఖాజా హుస్సేన్, బజారన్న, సాంబశివుడు, వెంకటస్వామి, సత్యరాజు, షేక్ మాలిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# రైతులకు యూరియా పంపిణీ


రైతులకు యూరియా పంపిణీచేసిన వ్యవసాయ అధికారి

**కోసిగి మేజర్ న్యూస్:** కోసిగి మండలంలో రైతులకు రైతుసేవా కేంద్రం ద్వారా యూరియా పంపిణీ చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి వరప్రసాద్ తెలిపారు. సోమవారం సజ్జలగుడ్డం, పెద్దభూంపల్లి, కోసిగి గ్రామాలలో యూరియా పంపిణీ రైతులకు అందజేశామన్నారు. రబీ పంటను సాగుచేసిన యూరియా కొరకు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ధరకే యూరియా పంపిణీచేస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ముళ్ళకంప తొలగింపు:** మండల కేంద్రమైన కోసిగి బుగేని చెరువు దగ్గర ఉన్న రైతుసేవా కేంద్రం చుట్టూ ఉన్న ముళ్ళ కంపను వ్యవసాయ అధికారి తొలగించడం జరిగింది. రైతుసేవా కేంద్రాలలో సేవలు నిలిపి వేయడంతో వాటి చుట్టూ ఉన్న ముళ్ళకంపను తొలగించి కేంద్రంలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆపరిసరాల్లో ఉన్న రైతులు ఆ రైతుసేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

# క్రీడా ప్రోత్సాహంతోనే పోలీసు కొలువులు..

**-నిరుపేద యువతకు అండగా నిలిచిన మల్లెల ఆల్ప్రెడ్ రాజు**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** క్రీడలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని, యువత భవిష్యత్తును బంగారుమయంగా తీర్చిదిద్దవచ్చని ఎమ్మిగనూరుకు చెందిన ప్రముఖ సామాజికవేత్త మల్లెల ఆల్ప్రెడ్ రాజు నిరూపించారు. ఆయన అందించిన ఆర్థిక సహకారం, నిరంతర ప్రోత్సాహంతో పట్టణానికి చెందిన ముగ్గురు నిరుపేద ఫుట్‌బాల్ క్రీడాకారులు పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఇటీవల వెలువడిన పోలీస్ నియామక ఫలితాల్లో స్థానిక క్రీడాకారులు బోయ వీరేష్, కామర్తి వినీత్ కుమార్, సరోదే శివకుమార్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో విజేతలను మల్లెల ఆల్ప్రెడ్ రాజు ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి, పూలదండలతో అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్ వీరేష్ మాట్లాడుతూ నేను నిరుపేద కుటుంబం నుంచి వచ్చాను. ఆరో తరగతి నుంచే నాలో ఉన్న ప్రతిభను గుర్తించి ఆల్ప్రెడ్ రాజు అండగా నిలిచారు. ఢిల్లీ, ముంబై, గుజరాత్, అస్సాం వంటి దూర ప్రాంతాల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లడానికి ఆయన ఎప్పుడూ వెనుకాడకుండా ఆర్థిక సాయం చేశారు. ఆయన సహకారం వల్లే నేను ఆరుసార్లు నేషనల్స్ ఆడగలిగాను. ఆ స్పోర్ట్స్ సర్టిఫికెట్లే నాకు పోలీస్ ఉద్యోగం వచ్చేలా చేశాయని అని కృతజ్ఞతలు తెలిపారు.తమ కోచ్ మాబు సాహెబ్ శిక్షణ, ఆల్ప్రెడ్ రాజు అన్న దాతృత్వం లేకపోతే తాము ఈ స్థాయిలో ఉండేవారం కాదని విజేతలు పేర్కొన్నారు. నిరుపేద క్రీడాకారుల పాలిట దేవుడిలా నిలిచిన మల్లెల ఆల్ప్రెడ్ రాజుపై పట్టణ ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.


ఉద్యోగం సాధించిన యువతకు సన్మానం చేస్తున్న మల్లెల

# బిఈడి కళాశాలల అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**:- యూనివర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** నిబంధనలు పాటించిన బిఈడి కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్, రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఆర్‌పిఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజులు మాట్లాడుతూ బిఈడి కళాశాలలో అక్రమాలపై కలెక్టర్‌కు వివరించారు. ఆర్‌యు పరిధిలో దాదాపు 49బిఈడి కళాశాలలు ఉన్నాయని వాటిలో ఒక్క కళాశాల కూడా ఎన్‌సిటిఈ నిబంధనను పాటించడం లేదని అన్నారు. బోధన సిబ్బంది లేకుండానే కళాశాలలు నడపడం తరగతులు లేకుండా కోర్సులు కొనసాగించడం, సరైన బోధన సిబ్బంది లేకుండానే సర్టిఫికేట్లు జారీ చేయడం, ల్యాబ్‌లు, ప్రాక్టికల్స్ నిర్వహించకుండానే మార్కులు వేస్తున్నారని తెలిపారు. ఈ అక్రమాలను నియంత్రించడాల్సిన యూనివర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బిఈడి కళాశాలలకు అఫిలియేషన్ ఇచ్చిన రాయలసీమ యూనివర్సిటీ కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో బిఈడి కళాశాలల్లో ఉర్దూ మీడియాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని దీనివల్ల తెలుగు విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ ఉర్దూ మీడియం విద్యార్థులకు తమ ప్రాక్టికల్స్ ఎక్కడ నిర్వహిస్తారన్న ప్రశ్నలకు సమాధానం లేదని తెలిపారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న విద్యార్థి నాయకులు

# ఎంపిడిఓ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు వర్ధంతి కార్యక్రమం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు ఎంపిడిఓ నాగరాజు ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి తన ప్రాణాలను త్యాగం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని తీసుకొచ్చిన మహనీయులు పొట్టిశ్రీరాములు అని వారి సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ఆదర్శమైన భావాలు కలిగిన వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ.ఓ బాలాంజనేయులు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


పూలమాల నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# ఘనంగా అమరజీవిపొట్టి శ్రీరాములు వర్ధంతి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** భాష ప్రయుక్త రాష్ట్రం ఏర్పడాలంటూ అమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విద్యాసాగర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తిప్పన్న, ఎంపిడిఓ నాగ అనసూయ వారి సిబ్బందితో కలిసి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు 58రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి పాటుపడ్డారన్నారు. అమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఈ కార్యక్రమలలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఏఓ వెంకటరమణయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపిఓ మద్దేశ్వరమ్మ, జిఎస్‌డబ్ల్యూ మండలాధికారి సుధీర్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఏపిఎం వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న తహశీల్దార్

# జడ్‌పిలో అమరజీవికి ఘన నివాళి

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగానికి సిద్ధమైన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్‌పి సిఈఓ జి నాసరరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు భారత స్వాతంత్ర్య సమరయోధుడని, గాంధేయవాది అని, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన మహానీయుడన్నారు. తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతూ 1952లో ఆయన 56రోజుల పాటు నిరాహార దీక్ష చేసి మరణించారన్నారు. ఆయన మరణం ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు దారి తీసిందని ఆయనను తెలుగు ప్రజలు అమరజీవిగా గౌరవంగా పిలుస్తారని, తెలుగు వారు ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి కార్యాలయ ఏఓలు జితేందర్, సిబ్బంది పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్‌పి చైర్మన్, సిబ్బంది

# బావులను పర్యాటక కేంద్రాలుగా మార్చండి

**– నగర పాలక అధికారులకు మంత్రి టి.జి.భరత్ ఆదేశాలు**



పురాతన బావిని పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్, అధికారులు

**కర్నూలు కెఎంసి, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగర శివార్లలోని జోహరాపురం పరిధిలో పాడుబడ్డ పురాతన బావులను అభివృద్ధి చేసి వాటిని పర్యాటక కేంద్రాలుగా మార్చాలని రాష్ట్ర పరిశ్రమల మంత్రి టి.జి.భరత్ కెఎంసి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కెఎంసి అధికారులతో కలిసి మూడు పురాతన బావులను పరిశీలించారు. వీటిని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను తయారు చేయాలని ఆయన చెప్పారు. తప్పెటగేరి బావి, చెన్నకేశవ ఆలయం వద్ద ఉన్న బావి, నర్సప్ప బావులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సంప్రదాయ జలవనరుల సంరక్షణతో పాటు నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విధంగా ఈ బావులను అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. బావి లోపల పూడిక తొలగించడం, నీటి నిల్వ సామర్థ్యం పెంచడం, రక్షణ గోడలు, సురక్షిత ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని, బావుల చుట్టూ పచ్చదనం పెంచడం, ల్యాండ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్‌లు, కూర్చునేందుకు బెంచీలు, సమాచార బోర్డులు ఏర్పాటు చేసి కుటుంబాలతో బావులను సందర్శించేలా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. అదే నగరంలోని ఏ క్యాంపు నుండి కిమ్స్ ఆసుపత్రి వరకు ఉన్న విభాగినిలను అభివృద్ధి చేసి సుందరీకరించాలని ఆయన ఆదేశించారు. నగర అభివృద్ధి మౌళిక సదుపాయాలతో పాటు పర్యాటక అవకాశాలను పెంచేలా ఉండాలని అన్నారు. కమిషనర్ విశ్వనాథ మాట్లాడుతూ సంప్రదాయ జలవనరులను పరిరక్షిస్తూ ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి వెంట ఇంఛార్జ్ ఎస్ఇ శేషసాయి, ఎంఇ మనోహర్, డిఇఇ కృష్ణలత, ఏఈ జనార్ధన్ తదితరులు ఉన్నారు.

# 15మంది ఎస్ఐలకు స్థాన చలనం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు రేంజ్‌లో 15మంది ఎస్ఐలకు స్థాన చలనం కల్పించినట్లు కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ల భద్రతలో భాగంగా 15మంది సిఐలను బదిలీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు ఓర్వకల్లు పిఎస్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎస్ఐ అఖిల్ కుమార్ నాగలాపురం పిఎస్‌కు, ఎమ్మిగనూరు రూరల్ పిఎస్‌కు అటాచ్‌లో ఉన్న ఎస్ మల్లికార్జునను మంత్రాలయం పిఎస్‌కు, దేవన కొండ పిఎస్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న పి నరేష్‌ను తుగ్గలి పిఎస్‌కు, చిప్పగిరి పిఎస్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న బి రాజాకుళ్లాయప్పను గూడూరు పిఎస్‌కు, వెల్దుర్తి పిఎస్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న వి విద్యశ్రీని పెద్దతుంబళం పిఎస్‌కు, తిరుపతిలో పనిచేస్తున్న పి హరితను మద్దికెర పిఎస్‌కు, అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న బి శ్రీప్రియను హాలహర్వి పిఎస్‌కు, పెద్దతుంబళం పిఎస్‌లో ఉన్న బి మల్లికార్జునను ఆదోని టుటౌన్ యుపిఎస్‌కు, తుగ్గలి పిఎస్‌లో ఉన్న ఎస్ బాల నరసింహులును డిఎస్‌బి కర్నూలుకు, మద్దికెర పిఎస్‌లో ఉన్న ఆర్ విజయ్‌కుమార్ నాయక్‌ను పత్తికొండ యుపిఎస్‌కు, హాలహర్వి పిఎస్‌లో ఉన్నమారుతిని డిఎస్‌బి కర్నూలుకు,మంత్రాలయం పిఎస్‌లో పనిచేస్తున్న ఎల్ శివాంజల్‌ను సిసిఎస్ కర్నూలుకు, నాగలాపురం పిఎస్‌లో పనిచేస్తున్న సి శరత్ కుమార్ రెడ్డిని కర్నూలు ఫోర్త్ టౌన్ యుపిఎస్‌కు, గూడూరు పిఎస్‌లో పనిచేస్తున్న జి హనుమంత రెడ్డిని కర్నూలు సిసిఎస్‌కు, కర్నూలు ఫోర్త్ టౌన్ యుపిఎస్‌లో పనిచేస్తున్న ఏపి శ్రీనివాసులును కర్నూలు త్రీ టౌన్ యుపిఎస్‌కు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన స్టేషన్లలో విధులు నిర్వహించాలని డిఐజి ఆదేశాలు జారీ చేశారు.

# బాస్కెట్ బాల్ పోటీలలో ఎస్ డి ఆర్ వరల్డ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**-బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ విభాగాల్లో ప్రథమ స్థానం**

**-విద్యార్థులను అభినందించిన మంత్రి టి.జి. భరత్**





**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** కర్నూలు జిల్లాలో నిర్వహించిన ప్రతిష్టాత్మక కె.ఎస్. భూషణ్ రావు మెమోరియల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్లో నంద్యాలకు చెందిన ఎస్ డి ఆర్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబరిచి చరిత్ర సృష్టించారు. బాలురు, బాలికల విభాగాల్లో ఏకకాలంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం ద్వారా ఈ పాఠశాల అరుదైన ఘనత సాధించింది.సాధారణంగా ఏదైనా టోర్నమెంట్‌లో ఒక పాఠశాల నుంచి ఒక విభాగం మాత్రమే ఫైనల్స్‌కు చేరుకోవడం కష్టమని, కానీ తమ విద్యార్థులు ఈ రెండు విభాగాల్లో విజయం సాధించడం అత్యంత అరుదైన ఘనతగా పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్ బాలుర జట్టు ఫైనల్ మ్యాచ్‌లో బలమైన అథీనా స్కూల్, కర్నూలు జట్టును ఎదుర్కొని విజయాన్ని అందుకుంది.బాలికల జట్టు ఫైనల్‌లో సెయింట్ జోసెఫ్ హై స్కూల్, కర్నూలు జట్టుపై తమ ఆధిపత్యాన్ని నిరూపించుకొని గెలుపొందింది. మంత్రి టి.జి. భరత్ హర్షం వ్యక్తం చేస్తూ, ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్ విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని మరియు కోచ్ నవీన్ కుమార్ ను అభినందించారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యంత అభినందనీయమని. ఈ ఘనత సాధించిన విద్యార్థులు భవిష్యత్తులోనూ మరిన్నివిజయాలుఅందుకోవాలిఅని మంత్రి పేర్కొన్నారు.ఈ విజయానికి కారణమైన కోచ్ నవీన్ కుమార్ అంకితభావంతో కూడిన శిక్షణ, పాఠశాల యాజమాన్య ప్రోత్సాహం మరియు విద్యార్థుల కృషి ప్రశంసనీయమని ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్ యాజమాన్యం తెలియజేసింది.

# దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈకార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో రామునాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సమయపాలనతో పరిష్కరించాలని సూచించారు. ఈపీజీఆర్ఎస్‌లో 267మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు.



పిజిఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

# జిలా పోలీసు కార్యాలయంలో అమరజీవికి ఘన నివాళి




పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ సునీల్ షెరాన్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు గాంధేయవాది బాషాప్రయుక్తా ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణాలను అర్పించి అమరజీవిగా నిలిచారన్నారు. ఆయన జ్ఞాపకార్థం నెల్లూరు జిల్లా పేరును పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్చారన్నారు. ఆయన స్మరించుకుంటూ మన తెలుగు బాషను సాంస్కృతిక విలువలను కాపాడుకోవడం మన బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ గోదా రంగనాథుల పూజా కార్యక్రమం



పూజలందుకుంటున్న శ్రీ గోదా రంగనాథుల స్వామి

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నగరంలో మామిదాలపాడు సమీపంలో గల శ్రీ గోదాగోకులంలో శ్రీ గోదా రంగనాథుల పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శ్రీధనుర్మాస వ్రత మహోత్సవం కార్యక్రమాలు మంగళవారం నుండి ప్రారంభమై ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం శ్రీగోదా గోకులం శ్రీ రంగనాయకి సమేత శ్రీ రంగనాథ స్వామి వారికి శ్రీ గోదా జయంతి సందర్భంగా గోదా అమ్మవారు, మూలవరులకు, ఉత్సవ వరులకు, శ్రీకృష్ణుడికి అష్టోత్తర శత కళశ అభిషేకం, తిరుమంజనం, అలంకారము, నివేదన మహామంగళారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి మహిళలు ఒడిబియ్యం, పిండివంటలు, పలహారాలు సమర్పించారు. ఈ పర్వదినం సందర్భంగా భక్తులు కీర్తనలు, భజనలు తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గోదాదేవి చరిత్ర గురించి ప్రశ్నలు ఏర్పాటు చేసి క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. సాయంత్రం మాఢవీధులలో స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు.

# పేదలను వదిలి పెద్దల సేవలో..!

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** ప్రజా ప్రయోజనాల కోసం పని చేయాల్సిన మున్సిపల్ పాలకవర్గం మున్సిపల్ అధికారులు పెద్దల మెప్పు కోసం పరితపిస్తున్నారన్న విమర్శలు డోన్ పట్టణంలో వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ళతరబడి సరైన సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు లాంటి మౌళిక వసతులు లేక మురికివాడలను తలపించే విధంగా ఉన్న పలు శివారు కాలనీల సమస్యలను గాలికొదిలేసి పెద్ద ఆదేశాలతో మున్సిపల్ నిధులను దారి మళ్ళించేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. డోన్ పట్టణంలో గత 20 ఏళ్ళ క్రితం ఏర్పడిన శ్రీరామ్‌నగర్, వైయస్.నగర్, భాస్కర్‌రెడ్డినగర్, ఆటోనగర్, సుజాతమ్మ నగర్, ఆర్‌ఈ.రవికుమార్‌కాలనీ లాంటి శివారు ప్రాంతాలు నేటికి సిసి రోడ్లు, డ్రైనేజి కాల్వలు లేక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మౌళిక వసతులు కల్పించడంటూ ప్రజలు, ప్రజా సంఘాలు నాయకులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నా అవన్నీ అరణ్య రోధనగానే మిగిలాయి. ప్రజా అవసరాలకు పెద్దపీఠ వేసి రూపొందించాల్సిన అజెండాలో కూడా ప్రజా సమస్యలను పొందుపరచకుండా నాయకుల స్వప్రయోజనాల కోసమే ప్రాకులాడటం వారి వైఖరికి అద్దం పడుతోంది. మున్సిపాలిటీకి వచ్చే అరకొర నిధులన సైతం బడా బాబుల ప్రయోజనాల కొరకు వెచ్చించడం పరిపాటిగా మారింది. ఇటీవల మున్సిపల్ సాధారణ నిధుల నుండి పేద ప్రజలు నివాసాలు ఉండే కాలనీలలో కాకుండా అధికార టిడిపి, వైయస్ఆర్‌సిపి నాయకుల నివాసాలు ఉండే నెహ్రూ నగర్‌కాలనీలో ఇదివరకే సిసి రోడ్లు ఉన్నప్పటికీ వాటిని తవ్వి మరీ సిసి రోడ్లు వేసి స్వామి భక్తిని చాటుకుంటున్నారన్న విమర్శలు ప్రజల నుండి వెల్లువెత్తుతున్నాయి. అంతే కాకుండా పట్టణంలోని భాష్యం స్కూల్ దగ్గర జనావాసాలు లేకునప్పటికీ ఓ టిడిపి నాయకుని ప్రోద్భలంతో లక్షలాది రూపాయల నిధులతో సిసి రోడ్డు, డ్రైనేజి నిర్మాణాలకు కౌన్సిల్ తీర్మానం ఆమోదించి ప్రతిపాదనలు చేయడం పట్ల పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజలను కేవలం ఓటు బ్యాంక్‌గానే పరిగణిస్తున్న రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలను గాలికివదిలేసి వారి వారి పెద్దల సేవలో తరించడం ఇకనైనా మానుకొని ఇకపై వచ్చే నిధులతో సామాన్య ప్రజలు నివాసం ఉండే వీధులలో మౌళిక వసతుల కల్పనకై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



వైయస్.నగర్‌లో ఓ వీధి దుస్థితి,



నెహ్రూనగర్‌లో వేసిన సిసిరోడ్డు